# పరిటాల-గోనుగుంట్ల వర్గీయుల మధ్య ఉద్రిక్తత

**- పోలీసులు నచ్చచెప్పడంతో ప్రశాంతంగా ముగిసిన ఎన్‌టిఆర్ వర్ధంతి వేడుకలు**

ధర్మవరం టౌన్, జనవరి 18 ప్రభాతవార్త



ఎన్‌టిఆర్ విగ్రహంపైకి ఎక్కనీయకుండా వేదికను ఆక్రమించుకున్న పరిటాల శ్రీరామ్ అనుచరులు



ఇరువర్గాలకు నచ్చజెబుతున్న సిఐ శ్యాంరావు

స్థానిక ఎన్‌టిఆర్ సర్కిల్‌లోని ఎన్‌టి రామారావు విగ్రహానికి పూలమాల వేయడంలో పరిటాల శ్రీరామ్, గోనుగుంట్ల సూర్యనారాయణ వర్గీయుల మధ్య ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఎన్‌టిఆర్ వర్ధంతి సందర్భంగా గురువారం ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలల సమర్పణకు పరిటాల వర్గం ఉదయం 10.30 గంటలకు సమయం నిర్ణయించగా, గోనుగుంట్ల వర్గం ఒక గంట ముందుగా పూలమాలలు వేయాలని నిర్ధారించుకున్నారు. దీన్ని గమనించిన పరిటాల వర్గం ముందుగానే వచ్చి ఎన్‌టిఆర్ విగ్రహ వేదికను ఆక్రమించుకుని గోనుగుంట్ల వర్గీయులను అడ్డుకున్నారు. పరిటాల శ్రీరామ్ స్థానిక టిడిపి ఇన్‌చార్జ్ అని ఆయనే తొలుత పూలమాల వేయాలని, ఆ తరువాత మీరు వేసుకోండని తెగేసిచెప్పారు. దీంతో అక్కడి పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో ట్రాఫిక్ సిఐ శ్యామరావు, రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ సిఐ అశోక్ కుమార్‌లు తమ సిబ్బందితో వచ్చి ఇరు వర్గాలకు నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. ఇందుకు తలొగ్గిన గోనుగుంట్ల వర్గీయులు విగ్రహానికి కొంత దూరం వెళ్ళి నిలుచున్నారు. ఇంతలో పరిటాల శ్రీరామ్ అక్కడకు వచ్చి ఎన్‌టిఆర్ విగ్రహానికి గజమాలను వేసి నివాళులు అర్పించి ఎన్‌టిఆర్ సేవలను కొనియాడారు. అనంతరం గోనుగుంట్ల వర్గీయులు వచ్చి నందమూరి విగ్రహానికి గజమాలలు వేసి నివాళులు అర్పించారు. గోనుగుంట్ల సూర్యనారాయణ సూచనల మేరకు ఆయన వర్గీయులు సాంత్వన పాటించడంతోనే అక్కడ ఘర్షణ తప్పిందని పలువురు అనుకోవడం కనిపించింది. ఉద్రిక్త వాతావరణం నుండి ప్రశాంతత నెలకునడంతో పోలీసులతో పాటు ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

# రాష్ట్రంలో లక్షల సంఖ్యలో ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగుల కల్పన

**- మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, వైఎస్సార్ ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడు రాజశేఖరరెడ్డి- 'జగన్ ఐటీ ఆర్మీ' పోస్టర్లను ఆవిష్కరించిన నాయకులు**

ఉరవకొండ, జనవరి 18 ప్రభాతవార్త



జగన్ ఐటీ ఆర్మీ పోస్టర్‌ను విడుదల చేస్తున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ ఐటీ విభాగం జిల్లా అధ్యక్షులు రాజశేఖరరెడ్డి తదితరులు

రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత లక్షల సంఖ్యలో ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు కల్పించబడ్డాయని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, వైఎస్సార్ ఐటీ విభాగం జిల్లా అధ్యక్షులు రాజశేఖరరెడ్డి అన్నారు. పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో గురువారం వారు ఇతర నాయకులతో కలిసి జగన్ ఐటీ ఆర్మీ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో నూతనంగా తీసుకొచ్చిన సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, డిజిటల్ లైబ్రరీలు, విలేజ్, అర్బన్ క్లీనిక్‌ల ద్వారా 2.5 లక్షలకుపైగా ప్రభుత్వఉద్యోగులను ప్రభుత్వం కల్పించిందన్నారు. రాష్ట్రాభివృద్ధికి సీయం జగన్‌కు ఐటీ విభాగం తోడుగా ఉంటుందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఐటీ ఉద్యోగులు ఐటీ ఆర్మీలో ఎన్‌రోల్ చేసుకోవాలన్నారు. గత 4 సంవత్సరాల్లో వైసీపీ ప్రభుత్వం గ్రామస్థాయి నుండి పట్టణాల వరకు ఎంతో అభివృద్ధి చేసిందని, సంక్రాంతి పండుగకు సొంత ఊళ్లకు వచ్చిన వారందరూ గ్రామాల్లో జరిగిన అభివృద్ధిని, మార్పును ప్రపంచానికి పరిచయం చేయాలన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా ఎప్పుడూ జరగని అభివృద్ధి, సంక్షేమం నేడు వైసీపీ ప్రభుత్వం అందిస్తోందన్నారు. గ్రామస్థాయి నుండి ఉద్యోగాలు చేస్తున్నవారు ఎన్‌రోల్ చేసుకొని నిరుద్యోగులకు అండగా ఉంటూ సహాయ సహకారాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీ విభాగం నాయకులు జ్ఞానేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఈనెలాఖరులోపు అభివృద్ధి ప్రణాళికలు మండల పరిషత్‌కు చేరాలి

**- శిక్షణా కార్యక్రమంలో సూచించిన ఎంపీడీఓ యం.డి.అమృత్‌రాజ్**

ఉరవకొండ, జనవరి 18 ప్రభాతవార్త



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపిడిఓ యం.డి.అమృత్‌రాజ్

గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు ఈనెల 31వ తేదీలోగా తయారుచేసి వాటిని మండల పరిషత్‌కు అందజేయాలని మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి యం.డి.అమృత్‌రాజ్ సూచించారు. పట్టణంలోని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఆయన ఈఓఆర్‌డీ పి.చంద్రమౌళితో కలిసి జీపీడీపీ ప్రణాళిక పూర్తీ చేయడంపై గ్రామ సర్పంచులు, యంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ సహాయకులు, మండలస్థాయి అధికారులకు రెండు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ యం.డి.అమృత్‌రాజ్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో అందుబాటులోవున్న వనరులు, చేపట్టాల్సి కార్యక్రమాల్లో ముఖ్యంగా మౌళిక సదుపాయాలు, పారిశుద్ధ్యం, తాగునీరు తదితరల అంశాలకు ప్రాధాన్యతనిస్తూ ఈనెల 25వ తేదీలోగా రెండు రోజులు గ్రామసభ పెట్టుకొని ప్రణాళికలను రూపొందించుకోవాలన్నారు. మండల పరిషత్ పంచాయతీల నుండి అందిన ప్రణాళికను మండల అభివృద్ధి ప్రణాళికగా జిల్లా పరిషత్‌కు పంపడం జరుగుతుందని వివరించారు. కాగా శిక్షణా కార్యక్రమానికి పంచాయతీ కార్యదర్శులు డిజిటల్ సహాయకులు మినహా ఇద్దరు ముగ్గురు సర్పంచులు, ఎంపిటీలు, మండలస్థాయి అధికారులు మాత్రమే హాజరుకావడం విశేషం.

# ఘనంగా కొల్లాపురమ్మవారి జాతర మహోత్సవం

శెట్టూరు, జనవరి 18 ప్రభాతవార్త



ప్రత్యేక అలంకరణతో పోతుల రాజులు

శెట్టూరు మండలం లక్ష్మంపల్లి గ్రామంలో గత మూడు రోజుల నుంచి జరుగుతున్న గ్రామ దేవత కొల్లాపూర్ అమ్మ జాతర మహోత్సవం పురస్కరించుకుని గురువారం పోతుల రాజుల విన్యాసాలు పూజలు, భక్తాదులను ఎంతో అబ్బురపరిచే విధంగా పోతురాజుల విన్యాసాలు జరిగాయి. పోతుల రాజుల విన్యాసాలను వీక్షించేందుకు పెద్ద ఎత్తున ప్రజలు ఆలయంలో చేరి వారు చేసే విన్యాసాలను తిలకించారు. ఎవరికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఆలయ కమిటీ వారు ముందస్తు చర్యలు చేపట్టారు. దాని వలన ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్‌శాఖ వారు బందోబస్తు నిర్వహించారు. ఈ జాతర శుక్రవారంతో ముగియనుంది.

# తెలుగువాడి సత్తాను చాటిచెప్పిన మహనీయుడు ఎన్టీఆర్

**- ఉరవకొండలో చిత్రపటంతో టీడీపీ ర్యాలీ, ఘన నివాళి**

**- ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ**

ఉరవకొండ, జనవరి 18 ప్రభాతవార్త



ఎన్టీఆర్ చిత్రపటంతో ర్యాలీ నిర్వహిస్తున్న తేదేపా శ్రేణులు



ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

తెలుగువాడి సత్తాను చాటిచెప్పిన మహనీయుడు తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు అని వక్తలు కొనియాడారు. ఎన్టీఆర్ వర్ధంతిను గురువారం నియోజకవర్గ కేంద్రమైన ఉరవకొండ పట్టణంలో తెలుగుదేశం పార్టీ ఘనంగా నిర్వహించింది. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలువేసి పూజలు చేసి ఘనంగా నివాళులర్పించిన అనంతరం అక్కడినుండి పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎన్టీఆర్ చిత్రపటంతో పట్టణంతో భారీర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక ప్రభుత్వకమ్యూనిటీ ఆసుపత్రికి చేరుకొని రోగులకు వైద్యులు చేతుల మీదుగా పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఎన్.విజయభాస్కర్, కార్యదర్శి మోపిడి గోవిందు, ఇరిగేషన్ బోర్డు మాజీ డైరెక్టర్ దేవినేని పురుషోత్తం, మాజీఎంపీపీ కె.జె.కుళ్లాయప్ప, నాయకులు ప్యారంకేశవానంద, యర్రగుంట్ల వెంకటేష్, యేళ్ల తిమ్మప్ప, నర్రా కేశన్న, లాయర్ శీనప్ప, చందా రాము, యం.రామాంజినేయులు, శంకర సుదర్శన్, మణిచౌదరి, కుమారస్వామి, రామక్రిష్ణ, గోపాల్, నారాయణ, క్రిష్ణ, రహంతుల్లా, నారాయణస్వామి నాయక్, ప్రసాద్‌నాయక్, రహంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఎన్టీఆర్ వర్ధంతి

గుడిబండ, జనవరి 18 ప్రభాతవార్త



ఎన్టీఆర్‌కు నివాళులు అర్పిస్తున్న మంజునాథ్

మండల కేంద్రంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు మద్దనకుంటప్ప ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తేదేపా నాయకులు మండల కేంద్రంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తేదేపా మండల అధ్యక్షులు మద్దనకుంటప్ప, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు మంజునాథ్‌లు మాట్లాడుతూ.. సమాజమే దేవాలయం ప్రజలే దేవుళ్లు అనే నినాదంతో ప్రజలకు సేవ చేసిన మహనీయుడు ఎన్టీఆర్ అని ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. తదనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఆసుపత్రి కమిటీ చైర్మన్ శివకుమార్, ప్రధాన కార్యదర్శి ప్రకాష్, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు లక్ష్మినరసప్ప, భీమరాజు, మాజీ వైస్‌ఎంపిపి రాజేంద్ర, బూదిలి జయరామప్ప, మాజీ ఎంపిటిసిలు పురుషోత్తం, కిష్టప్ప, వెంకటేష్, నజీర్, భోజరాజు, సీనియర్ నాయకులు రామాంజి, వెంకటేష్, చిత్రశేఖర్, శ్రీనివాస్, ఈరన్న, నాగలింగప్ప, శ్రీకాంత్, రంగస్వామి, రామచంద్ర, వెంకటరమణ, మాస్ యూనిట్ ఇన్‌చార్జ్‌లు జనార్ధన్, నాగేంద్ర, మంజునాథ్ పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌ను వీడి టిడిపిలో చేరిక

మడకశిర టౌన్, జనవరి 18 ప్రభాతవార్త



కాంగ్రెస్‌నుంచి టిడిపిలో చేరిన వారికి పసుపు కండువా కప్పి ఆహ్వానిస్తున్న చంద్రబాబునాయుడు

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో మడకశిర నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో మడకశిర పట్టణానికి చెందిన పలు పారిశ్రామిక వేత్త రత్నగిరి బ్యాంక్ యాజమాని మాకం రమేష్‌బాబు, సర్వోదయ కాలేజ్ కరస్పాండెంట్ నీలకంఠపురం ఆదినారాయణ, పలు వ్యాపార వేత్తలు కృష్ణమూర్తి, వెచ్చం రమేష్‌బాబు, వారి అనుచరులు ద్వారా టిడిపిలోకి చేరారు. వాళ్లను పసుపు కండువా వేఇస టిడిపిలోకి మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సాదరంగా ఆహ్వానించారు. నందమూరి తారక రామారావు 28వ వర్ధంతి సందర్భంగా మంగళగిరి టిడిపి కార్యాలయంలో ఎన్టీఆర్ భవన్లఓ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మడకశిర నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుండుమల తిప్పేస్వామి, తెలుగుదేశం పార్టీ నాయకులు ఈ కార్యక్రమంలో మడకశిర వాణిజ్య విభాగం సంఘం అధ్యక్షులు కట్ట కిషోర్ పాల్గొన్నారు.

# ఘనంగా ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలు

**- ఎన్టీఆర్ జీవిత చరిత్ర పుస్తకాలను విడుదలచేసిన సవిత**

పెనుకొండ, జనవరి 18 ప్రభాతవార్త



మాట్లాడుతున్న సవిత



ఎన్టీఆర్ జీవిత చిత్రలను పంపిణీ చేస్తున్న సవిత

బడుగు, బలహీన వర్గాల ఆశా జ్యోతి తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు 28వ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి సవిత ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అదే విధంగా ఎన్టీఆర్ అన్న క్యాంటీన్ వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఎన్టీఆర్ జీవిత చరిత్ర పుస్తకాలను విడుదల చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో బిసి వర్గాలకు నందమూరి తారక రామారావు పెద్ద పీట వేశారన్నారు. మహిళలకు ఆస్తిలో సమాన హక్కు కల్పించిన ఘనత ఎన్టీఆర్‌కు దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సోషల్ మీడియా అసత్య ప్రచారాలు చేసిన వారిపై చర్యలు తీసుకోండి

**- ఎస్‌పికి ఫిర్యాదు చేసిన మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి**

పుట్టపర్తిటౌన్, జనవరి 18, ప్రభాతవార్త



జిల్లా ఎస్‌పికి ఫిర్యాదు చేస్తున్న మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి

సోషల్ మీడియా నందు తనపై అసత్య ఆరోపణలు చేస్తూ తన ప్రతిష్టకు భంగం కలిగిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని శ్రీసత్యసాయి జిల్లా ఎస్‌పి ఎస్.వి. మాధవ రెడ్డికి మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి ఫిర్యాదు చేశారు. తన వ్యక్తిగత విషయాలపై సోషల్ మీడియాలో వైసిపికి చెందిన కొంత మందితో పాటు మరికొందరు నాయకులు తన వ్యక్తిగత ప్రతిష్టకు భంగం కలిగిస్తూ ప్రజలను, టిడిపి కార్యకర్తలను గందరగోళం సృష్టిస్తూ అన్ని విధాలుగా టిడిపికి చెందిన అభిమానులను మనో వేదనకు గురి చేస్తూ అసత్యప్రచారాలు చేస్తున్న వ్యక్తులపై పోలీసు ఉన్నతాధికారులతో సమగ్ర విచారణ చేసి సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు గురువారం ఎస్‌పి కార్యాలయానికి వెళ్ళి రాతపూర్వకంగా ఫిర్యాదు అందజేశారు. ఇందుకు ఎస్‌పి సానుకూలంగా స్పందిస్తూ విచారణ చేసి సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలియజేశారు.

# నేడు 8వ తరగతి విద్యార్థులకు ట్యాబులు పంపిణీ - డిఇఓ మీనాక్షి

కొత్తచెరువు, జనవరి 18, ప్రభాతవార్త

శ్రీసత్యసాయి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదివే విద్యార్థులకు ఫేజ్-2 క్రింద బైజూస్ ట్యాబులను శుక్రవారం పంపిణీ చేయనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారిణి యు.మీనాక్షి తెలియజేశారు. గురువారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లాలోని 10,730 మంది విద్యార్థులకు సంబంధించి అన్ని మండలాల ఎంఇఓలకు ఈ ట్యాబ్‌లను అందజేశారు. ఇప్పటికే డిసెంబర్ 21 రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకొని 5,440 బైజ్యూస్ ట్యాబ్‌లను పంపిణీ చేయడం జరిగింది. ఆ మిగతా 50 శాతం బైజ్యూస్ ట్యాబులను ఎంఇఓలు శుక్రవారం విద్యార్థులకు ట్యాబులను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

# ఈ నెల 22వ తేదిన సెలవు దినంగా ప్రకటించండి

**- డిఇఓను కోరిన ఎపియుఎస్ సంఘం నేతలు**

కొత్తచెరువు, జనవరి 18, ప్రభాతవార్త



డిఇఓకు వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

ఈ నెల 22న అయోధ్యలో బాల రాముని విగ్రహ ప్రతిష్టను పురస్కరించుకొని ఈ నెల22వ తేదిన సెలవుదినంగా ప్రకటించాలని కోరుతూ, ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు అమరా చంద్రబాబు ప్రధాన కార్యదర్శి సురేస్ బాబులు ఆ సంఘం నాయకులు గురువారం జిల్లా విద్యాశాఖ అధికారి మీనాక్షిని కలుసుకున్నారు. సంక్రాంతి సెలవులు 8వ తేది నుండి 18వ తేది వరకు ప్రకటించడం జరిగిందని, అనంతరం 19 నుండి 22వ తేది వరకు సంక్రాంతి సెలవులు పొడగించడం జరిగిందని, 22వతేదిన పాఠశాలలు పునఃప్రారంభమౌతాయని అదే రోజు అయోధ్యలో నూతనంగా నిర్మించిన రామాలయంలో బాలరాముని ప్రాణప్రతిష్ట చేయబోతున్న సందర్భంగా 22వ తేదిన సెలవుదినంగా ప్రకటించాని కోరారు.

# ఘనంగా ఆంధ్రుల ఆరాధ్య దైవం స్వర్గీయ నందమూరి తారక రామారావు వర్ధంతి

రొద్దం, జనవరి 18 ప్రభాతవార్త



తారక రామునికి నివాళులు అర్పిస్తున్న తేదేపా నాయకులు

ఆంధ్రుల ఆరాధ్య దైవం స్వర్గీయ నందమూరి తారక రామారావు 28వ వర్ధంతి సందర్భంగా సత్యసాయి జిల్లా అధ్యక్షులు పెనుకొండ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బికె.పార్థసారధి ఆదేశాల మేరకు రొద్దం మండలం తెలుగుదేశం పార్టీ కార్యాయలంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాలులు అర్పించి పార్టీ జెండాను ఎగురవేశారు. రొద్దం మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నరహరి పార్లమెంట్ అధికార ప్రతినిధి రొద్దం నరసిహులు, మహిళ అధ్యక్షురాలు సుబ్బరత్నమ్మ, నియోజకవర్గక మిటీ అధ్యక్షులు చిన్నప్పయ్య, నియోజకవర్గ ఉపాధ్యక్షురాలు లీలావతి, మాజీ సర్పంచు అశ్వర్థ నారాయణ, వాల్మీకి చంద్ర, మురళీకృష్ణ, హరికృష్ణ, షణ్ముఖ, తులసి, దాసరి రామాంజి, నరసింహారెడ్డి, రెడ్డిపల్లి, నాగరాజు, అశ్వర్థ, అక్బర్, చంద్ర, తిరుపతయ్య, ఉగ్రప్ప, రుద్రా నాగప్ప, రాజు, భత్తప్ప, నరసింహులు, గోపాల్, నగప్పా మద్దులేటి, నాగభూషణ, వెంకటేష్, నాగరాజు, కిష్టప్ప, గోవింద, మైలారప్ప, సత్తి, కదిరప్ప, ధనుంజయ, రాజప్ప, కోమటిశీన, రామకృష్ణ, నారాయణ, టిఎన్‌ఎస్‌ఎఫ్ సాయి, పవన్, పాతర్లపల్లి రామకృష్ణ, దురగప్ప, జయప్ప, తిప్పన్న, నాగరాజు, రొద్దకంపల్లి నాగరాజు, మౌలాలి, తిమ్మయ్య, దొడగట్ట రామచంద్ర, జయరాం, నారాయణ, ముత్యాలు, మంజు, ప్రభాకర్, నగప్ప, చిరంజీవి, అనిల్‌లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ తేదేపా నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఘనంగా ఎన్టీఆర్ వర్ధంతి

తాడిమర్రి, జనవరి 18 ప్రభాతవార్త



ఎన్టీఆర్ వర్ధంతి నిర్వహిస్తున్న దృశ్యం

విశ్వవిఖ్యాత నటసార్వభౌమ నందమూరి తారకరామారావు వర్ధంతిని తెలుగు దేశం నేతలు గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగాగ్రామ చావిడి సమీపంలో ప్రత్యేక వేదికను ఏర్పాటు చేసి ఎన్టీఆర్ చిత్రపటానికి పూల మాలలు వేసి టెంకాయలు కొట్టి నివాలులు అర్పించారు. ఈ సందర్భంగా టిఎన్‌టియుసి జిల్లా ఉపాధ్యక్షులు ముంటి మడుగు హర్ష ఆధ్వర్యంలో వందలాది మంది కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగాన్ని గౌరవిస్తూ ప్రజల వద్దకు పాలన తీసుకొచ్చి రాజకీయంగా సామాజికంగా ఎన్నో విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుని ప్రజల గుండెల్లో సుస్థిర స్థానాన్ని ఏర్పాటు చేసుకున్నారన్నారు. సినీ రాజకీయ రంగాల్లో తనదైన ముద్ర వేసి తెలుగు వారి ఆత్మగౌరవాన్ని భారతదేశమంతా విస్తరించిన మహానుభావుడన్నారు. ఈ సందర్భంగా పండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హర్ష, నిడిగల్లు మాజీ సర్పంచు గోనుగుట్ల భూషణ్, బిసి సెల్ నాయకులు ఆత్మకూరు ముసుగు శ్రీనివాసులు, కూచి హరి, భాస్కర్‌గౌడ్, పక్కీరా రెడ్డి, గణేష్, రంగయ్య, సోంపల్లి హరినాథ్, రవి, పాపానాయుడు, బాబు తదితరులు పాల్గొన్నారు. పలుగ్రామాల నుంచి వందలాది మంది కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# కసిరెడ్డిపల్లిలో చౌడేశ్వరి అమ్మవారి ఊరేగింపు

గోరంట్ల,జనవరి 18,ప్రభాతవార్త:



అమ్మవారిని గ్రామానికి తీసుకెల్తున్న భక్తులు

మేజర్ పంచాయతీ పరిధిలోని కసిరెట్టిపల్లి గ్రామంలో చౌడేశ్వరి అమ్మవారి ఊరేగింపు గ్రామ ప్రజలు ఘనంగా నిర్వహించారు. చౌడేశ్వరి అమ్మవారి ఊరేగింపులో భాగంగా తొలుత పట్టణం నుండి గురువారం సాయంత్రం చౌడేశ్వరి అమ్మవారి విగ్రహాన్ని కసిరెడ్డిపల్లి గ్రామానికి తీసుకెళనల్ల అమ్మవానికి ప్రతేక పూజా కార్యక్రమాలు నిర్వహించి భారి ఊరేగింపు నిర్వహించారు.

# ఘనంగా ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలు

గోరంట్ల,జనవరి 18,ప్రభాతవార్త:



అసుపత్రిలో రోగులకు పాలు బ్రెడ్లును పంపిణి చేస్తున్న దృశ్యం

మండల పరిధిలోని తెలుగుదేశం పార్టీ నాయకుల ఆధ్వర్యంలో మాజి ముఖ్య మంత్రితి స్వర్గీయ నందమూరి తారక రామారావు వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు, సత్యసాయి జిల్లా టిడిపి అధ్యక్షులు మాజి ఎమ్మెల్యే బికే పార్థసారధి ఆదేశాల మేకరు మండల కన్వీనర్ సోమశేఖర్, జిల్లా కార్యదర్శి దేవరసింహప్ప, మండల ప్రధానకార్యదర్శి అశ్వర్థరెడ్డి తెలుగుదేశంపార్టీ నాయకుల ఆధ్యర్యంలో గోరంట్లబస్టాండ్ సర్కిల్ ఉన్న నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలవేసి ఎన్టీఆర్ అమర్‌రహే అనేనినాదాలుచేస్తు నివాళులర్పించారు. అనంతరం గోరంట్ల ప్రభుత్వఅసుపత్రి నందు రోగులకు పాలు బ్రెడ్డు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో నిల కంఠరెడ్డి, జిల్లా కార్యదర్శి వేణుగోపాల్ రాయల్, వెంకటరెడ్డి, ఉమర్‌ఖాన్, నరేంద్ర రాయల్, ఉమాశంకర్, జయరాం, అజ్మతుల్లా తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# మడకశిర నియోజకవర్గానికి వెలుగునిచ్చింది ఎన్టీఆర్

**- రాష్ట్ర టిడిపి కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి**

అమరాపురం,జనవరి 18,ప్రభాతవార్త:



ఎన్టీఆర్‌కు నివాళులర్పిస్తున్న దృశ్యం

మండల పరిధిలోని గోళ్ళమారనపల్లి గ్రామంలో దివంగత మహానేత ఎన్టీఆర్ 28వ వర్ధంతి వేడుకలను తెలుగుదేశం పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పార్టీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, జిల్లా కార్యదర్శి నరసింహమూర్తి, మండల కన్వీనర్ గణేష్, మాజీ కన్వీనర్ శివరుద్రప్ప, బీసీసెల్ కార్యదర్శి క్రిష్ణమూర్తి, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు జయకుమార్, టిఎన్‌టియుసి నియోజకవర్గ ఉపాధ్యక్షులు రామచంద్ర, టిఎన్ఎస్ఎఫ్ కార్యదర్శి నవీన్‌కుమార్, మాజీ సర్పంచ్ కుమార స్వామి తదితరులు పాల్గొన్నారు. ఎన్టీఆర్ చిత్ర పటానికి పూల మాలనివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ మడకశిర నియోజకవర్గానికి వెలుగునిచ్చింది ఎన్టీఆర్ అని పేర్కొన్నారు. మడకశిర నియోజకవర్గంలో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో మడకశిర నియోజకర్గ ఇంచార్జ్ గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలుచేపట్టినట్లు ఆయన వివరించారు. మడకశిర నియోజక వర్గంలో అన్ని చెరువులకు సాగునీరు రావాలంటే మరల ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు కావాలని ఆయన పిలుపు నిచ్చారు. అదేవిధంగా గోళ్ళ మారనపల్లి నాయకులు రామచంద్రప్ప, యునిట్ ఇంచార్జ్ గౌడ్, రంగప్పలు మాట్లాడుతూ మాగ్రామానికి తారు రోడ్డుతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారని, అదేవిధంగా ఎన్టీఆర్ విగ్రహాన్ని అందించి వచ్చే వర్ధంతిలోపు ప్రతిష్టపన చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు చంద్రశేఖర్‌గౌడ్, దాదాఫీర్, ఎంపిటిసి ఓంకార్ స్వామి, మండల తెలుగుయువత అధ్యక్షులు నాగరాజు, మాజి ఎంపిటిసి శివకుమార్, శ్రీనివాస్ గౌడ్, రంగప్ప, రామచంద్రప్ప, తిప్పేస్వామి, శ్రీరామ్ మాజి డిలర్ చిట్టేప్ప, వార్డు మెంబర్లు శిశుకుమార్, సిద్దేశ్ రెస్టారెంట్ క్రిష్ణామూర్తి, తిమ్మన్న, మండల కార్యదర్శి శ్రీనివాస్, జిటిఎస్ అభిమానులు పాల్గొన్నారు.

# ఘనంగా ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలు

అమరాపురం,జనవరి 18,ప్రభాతవార్త:



పూలమాలలు వేస్తున్న దృశ్యం

మండల కేంద్రంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద 28వ ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలను టిడిపి నాయకులు గురువారం ఘనంగా నిర్వహంచారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ గణేష్. మాజీ కన్వీనర్ శివరుద్రప్ప, మాజి ఎంపిపి క్రిష్ణమూర్తి, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు జయకుమార్, మండల ప్రధానకార్యదర్శి జయరామ్ తదితరుల సమక్షంలో ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎన్టీఆర్ రాష్ట్రనికి చేసిన సేవలను వివరించడంతో పాటు రాష్ట్ర అభివృద్ధికి టిడిపి పార్టీ ఎంతో కృషి చేసిందని యుగపురుసుడు ఎన్టీఆర్ వారసుడిగా చంద్రబాబు నాయుడు మరళా ముఖ్య మంత్రి రాష్ట్ర అభివృద్ధికి కృషి చేసే విధంగా ప్రజలు సహకరించాలని టిడిపి నాయకులు కోరారు. ఈ కార్యక్రమం నందు టిడిపి నాయకులు టిఎన్‌టియుసి నియోజకవర్గ ఉపాధ్యక్షులు గోళ్లమారనపల్లి రామచంద్ర, పార్లమెంట్ తెలుగుయువత ఉపాధ్యక్షులు రఘు, యువనాయకులు నాగోనపల్లి మంజునాత్, మాజీ ఎంపిపి రామిరెడ్డి, మాజి సర్పంచ్‌లు ఈరన్న, శకునప్ప, మాజి డిలర్లు శ్రీనివాస్, రామన్న, నిరంజన్, చెన్నప్ప, క్లస్టర్ ఇంచార్జ్‌లుక్రిష్ణమూరి, రవి, మాజీ ఎంపిటిసిలు శివకుమార్, ధనుంజయ, సినియర్ నాయకులు పరమేశ్వరప్ప, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# 2024-25 పండ్లతోటల పెంపకం చేపట్టుటకు ధరఖాస్తులు ఆహ్వానం

నంబులపూలకుంట, జనవరి 18, ప్రభాతవార్త:

2024-25 సంవత్సరానికి సంబంధించి పండ్లతోటల పెంపకం చేపట్టుటకు ధరఖాస్తులు ఆహ్వానించడం జరిగిందని ఏపిఓ చంద్రశేఖర్ తెలియజేశారు. ఈ సందర్భంగా ఏపిఓ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఒక జాబ్ కార్డులో ఉన్న వారి అందరి భూమి కలిపితే మెట్టభూమి ఐదు ఎకరాల లోపు, లేదా తరిభూమి రెండున్నరఎకరాలలోపు ఉండాలనీ, ఈ రెండింటిలో ఏ ఒక్కటి ఎక్కువ ఉన్నను ఆ రైతులు ఈ పథకంకు అర్హులుకాదన్నారు. అలాగే ఆ జాబు కార్డులో ఏ ప్రభుత్వ ఉద్యోగి ఉన్న వ్యక్తి ఉన్నను ఆ జాబు కార్డు కూడా అర్హత ఉండదన్నారు. పై తెలిపిన ప్రకారం అర్హత కలిగిన ఉన్న రైతులు చిన్న, సన్నకారు సర్టిఫికెట్స్‌ను తహసిల్దార్ కార్యాలయం నుండి తీసుకొని ఒరిజినల్ పాసు పుస్తకం, జిరాక్స్‌తో పాటు ఆఫీస్‌కు తీసుకొని రావాలి. అలాగే ఫీల్డ్ అసిస్టెంట్‌ల దగ్గర ధరఖాస్తు ఫారమ్‌ను తీసుకొని పూర్తీచేసి ఆదరఖాస్తులోని సంబంధితవ్యక్తులతో సంతకాలుచేయించి కార్యాలయంలో అందజేయాలన్నారు. గతంలోఎవరైనా లబ్దిపొంది ఉన్నట్లైతే అలాంటి వారు ఫీల్డ్ నందు మొక్కలు సర్వైవల్ శాతం ఎక్కువ ఉంటే గతంలో ఐదుఎకరాలు తీసుకొని ఉంటే ఇప్పుడు మరలా ఆ జాబు కార్డును ఇవ్వడానికి అవకాశం ఉండదన్నారు. ఒకవేల గతంలో మూడుఎకరాలు విస్తీర్ణం తీసుకొని ఉన్నట్లయితే అలాంటి జాబ్ కార్డు వారుపై తెలిపిన ప్రకారం అర్హులు అయితే ఇప్పుడు మరల రెండుఎకరాలవరకు తీసుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. గతంలో పథకం ద్వారా లబ్ది పొంది మొక్కలునాటక పోయినా, నాటిన మొక్కలు చంపేసి ఉన్న అలాంటివరు మరలా ఇప్పుడు ధరఖాస్తు చేస్తే అటువంటి జాబు కార్డులను తిరిగి ఇవ్వడానికి అవకాశం ఉందన్నారు. కావున దయచేసి ఈ విషయాలన్నింటినీ బాగా అర్థం చేసుకొని గ్రామాలలో కూడా ప్రతి ఒక్కరికీ తెలియజేసి నిజమైన లబ్దిదారులు ఉన్నట్లైతే పండ్ల తోటల పెంపకం కొరకు అప్లై చేసుకోవచ్చునారు.

06ATP27_06ATP27.qxd 18-01-2024 PM 10:43 Page 1



## ఈ నెల 19 నుండి కులగణన సర్వే

**- సంయుక్త కలెక్టర్ అభిషేక్‌కుమార్**

**పుట్టపర్తి, జనవరి 18, ప్రభాతవార్త**



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా సంయుక్త కలెక్టర్ అభిషేక్‌కుమార్

ఈ నెల 19వ తేది నుండి 28వ తేది వరకు కులగణన సర్వే చేపట్టడం జరుగుతుందని జిల్లా సంయుక్త కలెక్టర్ అభిషేక్‌కుమార్ తెలియజేశారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నందు కులగణన సర్వేపై జిల్లాలోని మున్సిపల్ కమీషనర్లు, ఎంపిడిఓలు, తహశీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ నెల 19 నుండి 28 వరకు 10 రోజుల పాటు మొబైల్ యాప్ ద్వారా డోర్ టూ డోర్ సర్వే నిర్వహిస్తారని, రెవెన్యూ, పంచాయతీ రాజ్, మున్సిపల్ శాఖ, ప్లానింగ్, సంక్షేమ శాఖల నుండి ఎంపిక చేసిన సూపర్‌వైజర్లు, మండల ప్రత్యేక అధికారులు, డివిన్, జిల్లా అధికారులు ఈ సర్వేను పర్యవేక్షిస్తారన్నారు. గ్రామ/వార్డు సచివాలయాల పరిధిలో ఇంటింటికి వెళ్ళి కులగణన చేస్తారని, దీని కోసం రూపొందించిన ప్రత్యేక యాప్ ఇప్పటికే అందుబాటులోకి వచ్చిందన్నారు. ఈ కులగణన కోసం గ్రామ, మండల, జిల్లా, జోనల్ స్థాయిలలో శిక్షణ కార్యక్రమాలు ఇంతకు ముందే పూర్తి చేయడం జరిగిందన్నారు. ప్రజల సామాజిక స్థితిగతులను తెలుసుకోవడం కోసం ఈ కులగణన చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిందని, జిల్లాలో ఈసర్వే పకడ్బందీగానిర్వహించేందుకు ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ప్రభుత్వ విధాన నిర్ణయాలు రూపొందించడానికి, సంక్షేమ పథకాలు అమలు చేయడానికి, ఈ సర్వే వివరాలు దోహదపడతాయని, తద్వారా బడుగు బలహీన, వెనుకబడిన వర్గాల వారికి మరింత మేలు జరుగుతందన్నారు. ఈ సర్వే ఊర్తిగా స్వచ్ఛంధంగా సేకరించిన సమాచారం ప్రభుత్వం వద్ద భద్రంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో ఆర్డినేటర్ శివారెడ్డి, సిపిఓ విజయ్‌కుమార్, జిల్లాలోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఎన్‌టిఆర్ చూపిన దారిలో వేళితే విజయం తథ్యం- పరిటాల శ్రీరామ్

**ధర్మవరం టౌన్, జనవరి 18 ప్రభాతవార్త**



ఎన్‌టిఆర్ విగ్రహ్దానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న పరిటాల శ్రీరామ్

తెలుగు దేశం పార్టీ వ్యవస్థాప కులు నందమూరి తారక రామారావు చూపిన దారిలో వెళితే విజయం తథ్యమని పరిటాల శ్రీరామ్ అన్నారు. ఎన్‌టిఆర్ వర్ధంతి సందర్భంగా గురువారం ఆయన ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివా ళులు అర్పించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా తెలుగు వారి కీర్తికిరీటాన్ని వ్యాపింపజేసిన మహనీయుడని ఆయన కీర్తించా రు. ధర్మవరానికి స్వాతంత్ర్యం ఇచ్చిన ఘనుడని ఆయన అన్నారు. గొప్ప వ్యక్తులను వారి జయంతి,వర్ధంతుల సందర్భంగా మాత్రమే వారిని స్మరించు కుంటామని, అయితే నిత్యమూ ఎన్‌టిఆర్‌ను తలచుకోకుండా ఉండలేమని తెలిపారు. 1982వరకూ రాష్ట్రంలో కొన్ని వర్గాలకు మాత్రమే పాలనాధికారం పరిమితం అయ్యిందని, ఎన్‌టిఆర్ వచ్చాక బడుగు, బలహీన వర్గాలకు కూడా రాజ్యాధికారంలో అవకాశం వచ్చిందన్నారు. ఎన్‌టిఆర్ చూపిన స్పూర్తి ఇప్పటికీ మార్గదర్శకంగా ఉందన్నారు. ఆ నాడు అరాచకశక్తుల చేతుల్లో ఉన్న ధర్మవరంను వారి నుండి స్వాతంత్ర్యం లభించేలా చేశారన్నారు. ఎన్‌టిఆర్ ఆత్మ ఎప్పటికీ తెలుగువారితో పాటు తెలుగు దేశం పార్టీలోనే ఉంటుందని తెలిపారు. అంతకుముందు కొత్తపేటలోని ఎన్‌టిఆర్ విగ్రహానికి కూడా ఆయన పూలమాలలు వేశారు. అక్కడ జరిగిన కార్యక్రమంలో దాదాపు 50 మంది టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో పెద్దఎత్తున టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గ్రంథాలయాన్ని తనిఖీ చేసిన సంస్థ జిల్లా కార్యదర్శి పి.రమ

**- గ్రంథాలయానికి ఫ్యాన్ వితరణ చేసిన పాఠకుడు**

**కనగానపల్లి, జనవరి 18 ప్రభాతవార్త**



జిల్లా గ్రంథాలయ అధికారి పి.రమకు ఫ్యాన్లను అందజేస్తున్న పాఠకుడు

మండల కేంద్రంలోని స్థానిక గ్రంథాలయంలో గురువారం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.రమ వార్షిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయానికి సంబంధించిన పలు రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే గ్రంథాలయ పన్ను వసూలుకు కృషి చేయవలసిందిగా తెలియజేశారు. అనంతరం గ్రంథాలయం యొక్క పనితీరును, అందుబాటులో ఉన్న పుస్తకములను మొదలగు సౌకర్యాలను గ్రంథాలయానికి వచ్చిన పాఠకులను అడిగి తెలుసుకున్నారు. పాఠకులకు అవసరం ఉన్న చో రీడర్స్ ఆన్ డిమాండ్ రిజిస్టర్‌లో నమోదు చేయాలని వాటిని కూడా సాధ్యమైనంత త్వరలో తెప్పిస్తామని తెలియజేశారు. అలాగే నూతనంగా నిర్మించిన గ్రంథాలయ భవనానికి మండల కేంద్రానికి చెందిన గ్రంథాలయ పాఠకుడు శిరీష గుప్తా గ్రంథాలయానికి రెండు ఫ్యాన్లు విరాళంగా అందజేశారు. వారిని శాలువాతో సత్కరించారు. అనంతరం మండల గ్రంథాలయాధికారి గోవిందు మాట్లాడుతూ.. గ్రంథాలయానికి విరాళము అందజేసి గ్రంథాలయ అభివృద్ధికి సహకరించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి డి.గోవిందు, సిబ్బంది వెంకటరమణ, పాఠకులు, ప్రజలు పాల్గొన్నారు.

## చిరస్మరణీయుడు ఎన్‌టిఆర్

**గోనుగుంట్ల వర్గీయులు**

**ధర్మవరం టౌన్, జనవరి 18 ప్రభాతవార్త**



ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న గోనుగుంట్ల అనుచరవర్గం

తెలుగు దేశం పార్టీ వ్యవస్థాపకులు, సినీ నటనలో అగ్రగణ్యులు అయిన ఎన్‌టి రామారావు చిరస్మరణీయులని మాజీ ఎంఎల్‌ఎ గోనుగుంట్ల సూర్యనారాయణ అనుచర వర్గం పేర్కొంది. ఎన్‌టిఆర్ వర్ధంతి వేడుకల సందర్భంగా వారు ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ముఖ్యమంత్రిగా రాష్ట్రానికి, సినీ హీరోగా సినిమా రంగానికి చేసిన సేవలు అనిర్వచనీయమన్నారు. కోట్లాది మంది ప్రజల హృదయాల్లో శాశ్వత స్థానాన్ని సంపాదించుకున్నారని వారు తెలిపారు. నటన, రాజకీయ చతురతతో తెలుగు ప్రజల గొప్పతనాన్ని ప్రపంచవ్యాప్తంగా వ్యాపింపజేసిన మహనీయుడని వారు కీర్తించారు. మూడు సార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన ఎన్‌టి రామారావు తన పాలనా సంస్కరణలతో తెలుగువారి మదిలో చిరస్థాయిగా నిలిచిపోయారని తెలిపారు. సంస్కరణల్లో భాగంగా ఎన్‌టిఆర్ అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలు దేశంలోనే మార్గదర్శకం అయ్యాయని తెలిపారు. సమాజం దేవాలయమని, ప్రజలు దేవుళ్ళు అని, వారికి కూడు,గూడు,గుడ్డ ఇవ్వడమే తన కార్యాచరణ ప్రణాళిక అంటూ చెప్పుకున్న ఎన్‌టిఆర్ పేదలపాలిట పెన్నిధిగా నిలిచారన్నారు. ఈ సందర్భంగా తుంపర్తి పరమేష్, అరవిందరెడ్డి, డిష్ రాజు,నారాయణస్వామి, సూర్యనారాయణరెడ్డి, నబీరసూల్‌తో పాటు పాల్గొన్న పలువురు నాయకులు ఎన్‌టిఆర్‌కు జోహార్లు అర్పించారు.

## గిరిజనుల జీవితాల్లో వెలుగులు నింపిన ఘనత సీయం జగన్‌దే

**- వైసీపీ ప్రభుత్వంలో అర్హత కల్గిన గిరిజనులకు సాగు హక్కు పట్టాలు**

**- మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, టీటీడీ బోర్డు సభ్యులు అశ్వర్థనాయక్, వైసీపీ యువజన విభాగం జోనల్ ఇంచార్జ్ వై.ప్రణయ్‌రెడ్డి**

**- వైసీపీ కార్యాలయంలో అట్టహాసంగా గిరిజనుల ఆత్మీయ సమ్మేళనం**

**ఉరవకొండ, జనవరి 18 ప్రభాతవార్త**



ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

దివంగత వైఎస్సార్ అడుగుజాడల్లో రాష్ట్రంలో గిరిజనుల అభివృద్ధి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేస్తూ వారి జీవితాల్లో వెలుగులు నింపుతున్నారని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. పట్టణంలోని స్థానిక వైసీపీ కార్యాలయంలో గురువారం ఉరవకొండ నియోజకవర్గస్థాయి గిరిజన బంజారా ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం జరుగగా ఆయనతోపాటు టీడీపీ ట్రస్టు బోర్డు సభ్యులు అశ్వర్థనాయక్, వైసీపీ యువజన విభాగం జోనల్ ఇంచార్జ్ వై.ప్రణయ్‌రెడ్డి, రాయదుర్గం మార్కెట్ యార్డు ఛైర్మెన్ భోజరాజునాయక్, జీవీఎస్‌ఎస్ రాష్ట్ర అధ్యక్షులు శివశంకర్‌నాయక్, వజ్రకరూరు సర్పంచ్ దేవిబాయి, రూపానాయక్ తండాసర్పంచ్ శివాజీనాయక్, సీనియర్ నాయకులు గోవిందునాయక్, సామానాయక్ తదితరులు హాజరయ్యారు.ఈ సందర్భంగా వారుమాట్లాడుతూ గిరిజనులుసాగుచేసుకొంటున్న అటవీ భూములకు సాగుహక్కు పట్టాలు మంజూరుచేసింది దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖరరెడ్డి అన్నారు. ఉరవకొండ నియోజకవర్గంతోపాటు జిల్లాలోవున్న గిరిజన రైతులకు సాగు హక్కు పత్రాలు మంజూరు చేయాలని అప్పటి సీయం వైఎస్సార్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన తక్షణమే స్పందించి ఉత్తర్వులు ఇచ్చారన్నారు. గతంలో గిరిజనులకు మంత్రి పదవులు లేకుండా చంద్రబాబు మోసంచేయగా జగన్‌అధికారంలోకి రాగానే గిరిజనులను ఉప ముఖ్యమంత్రులుగా చేసి రాజ్యాధికారం అందించారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుంకేనాయక్, చంద్రమౌళినాయక్, ప్రసాద్‌నాయక్, నాగరాజు నాయక్ శీనా నాయక్, వెంకటేష్‌నాయక్, చంద్రనాయక్, తిప్పేస్వామినాయక్, బాబు నాయక్, సుంకేనాయక్, తిరుమల నాయక్, హనుమంతు నాయక్, భీమా నాయక్, నారాయణ నాయక్, వెంకటానాయక్, రమేష్‌నాయక్, తులసినాయక్ తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న విడిచిన బాణమే జగన్‌కు ఎదురుతిరిగింది..!

**- రాష్ట్రంలో ఇండియా కూటమి రోజు రోజుకు బలపడుతోంది**

**- టీడీపీ, జనసేన మతతత్వ బీజేపీను నమ్మవద్దని కోరుతున్నాం**

**- విలేఖరుల సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి సి.జాఫర్**

**ఉరవకొండ, జనవరి 18 ప్రభాతవార్త**



విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి సి.జాఫర్

జగనన్న విడిచిన బాణం షర్మిల జగన్‌కు నేడు ఎదురుతిరిగిందని సీపీఐ జిల్లా కార్యదర్శి సి.జాఫర్ అన్నారు. పట్టణంలోని స్థానిక ఐదుకల్లు సదాశివన్ భవనంలో గురువారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఇండియా కూటమి రోజురోజుకు బలపడుతోందని అందుకు షర్మిల కాంగ్రెస్‌పార్టీ పగ్గాలు చేపట్టడమే నిదర్శనమన్నారు. తెలుగుదేశం, జనసేన పార్టీలు మతతత్వ బీజేపీను దూరంపెట్టి తమతో కలిసిరావాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యేలు, ఎంపీలను బదిలీ చేస్తున్న ఏకైక సీయం జగన్మోహన్‌రెడ్డి అని ఆయన్ను బటన్ నొక్కి ఇంటికిపంపడానికి జనంసిద్ధంగాఉన్నారన్నారు. అనతపురంజిల్లా దశాబ్దాలుగా క్షామపీడిత ప్రాంతమని రాష్ట్ర ప్రభుత్వం కరువు మండలాలుగా ప్రకటించి చేతులు దులుపుకుందితప్ప ఇప్పటి వరకు ఎలాంటి కరవు సహాయక చర్యలు చేపట్టలేదన్నారు. గతఏడాది నవంబర్12న కేంద్ర కరువు బృందాలు పంకజ్ యాదవ్ నేతృత్వంలో 12మంది ఐఏఎస్ అధికారులు రెండురోజులు ఉమ్మడి అనంతపురం జిల్లాలో తూతూమంత్రంగా పర్యటించి కరువును పరిశీలించి వెళ్లారని వారుకేంద్రానికి ఏంనివేదిక ఇచ్చారోకూడా ఇప్పటివరకు తెలియదన్నారు. కూడేరు మండలంలోనే కేవలం ఏడాది కాలంలోనే 12 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఇలాంటి ఆత్మహత్యలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపైనే ఉందన్నారు. 2017లో 890 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టిన సామూహిక బిందు సేద్యంను జగన్ ప్రభుత్వం మూలనపడేసిందని మండిపడ్డారు. సీయం తాడేపల్లి క్యాంపుకార్యాలయం వీడటంలేదని ఆయనప్రభుత్వంపై ఉద్యోగులు, ఉపాధ్యాయులు, రైతులు,నిరుద్యోగులు, కూలీలు, అంగన్‌వాడీలు ఇలా అన్ని వర్గాల్లో తీవ్రమైన వ్యతిరేఖత వచ్చిందని వచ్చే ఎన్నికల్లో ఆయన ఓటమి ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో గొర్రెల పెంపకందార్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి పోతులయ్య, జిల్లా కార్యవర్గ సభ్యుడు కేశవరెడ్డి, సీనియర్ నాయకులు శ్రీరాములు, తాలుకా కార్యదర్శి మల్లికార్జున, సహాయ కార్యదర్శి మనోహర్, వజ్రకరూరు మండల కార్యదర్శి సుల్తాన్, సహాయ కార్యదర్శి హనుమంతు, కూడేరు మండల కార్యదర్శి నారాయణమ్మ పాల్గొన్నారు.

## శ్రీరామిరెడ్డి తాగునీటి సరఫరా కార్మికులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలి

**- పైప్‌లైన్ల ధ్వంసానికి బాధ్యులైన ఎంపీ, డీఈఈ, సర్పంచ్ భర్తపై కేసు పెట్టాలి- విలేఖరుల సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్**

**ఉరవకొండ, జనవరి 18 ప్రభాతవార్త**



విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

శ్రీరామిరెడ్డి తాగునీటి సరఫరా కార్మికులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు. పట్టణంలోని స్థానిక సీఐటీయూ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 5 నెలల జీతం బకాయిలు, 10 నెలల పీఎఫ్ చెల్లించాలని సమ్మె చేయడమే కార్మికుల తప్పన్నట్టు వారిపై అక్రమ కేసులు పెట్టడం దారుణమన్నారు. అవగాహన రాహిత్యంతో డ్యాంలో మోటార్లు ఆన్‌చేయడానికి, పైప్‌లైన్ ధ్వంసం కావడానికి ప్రధాన కారణం ఎంపీ తలారి రంగయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ శ్రీనివాసులు, సర్పంచ్ భర్త భాస్కర్‌రెడ్డిలే కారణమని నిజంగా కేసుపెట్టాల్సివస్తే వారిపైపెట్టాలన్నారు. ఎంపీ ఆదేశాలతోనే వారు నీటివిడుదలకు ఉపక్రమించారన్నారు. పైప్‌లైన్ పగిలిపోవడానికి కార్మికులకు ఎలాంటి సంబంధం లేదని పగిలిన పైప్‌లైన్‌ను పరిశీలించడానికి వెళ్లిన పోలీసులకు స్థానిక రైతులు, ప్రజలు స్పష్టంగా చెప్పినా వాటిని పరిగణిలోకి తీసుకోకుండా కార్మికులపై కేసులు పెట్టడం సరైంది కాదన్నారు. ఈ సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి మధుసూదన్, జిల్లా కమిటీ సభ్యుడు రంగారెడ్డి, నాయకులు శీనప్ప తదితరులు పాల్గొన్నారు.

**అంగన్‌వాడీలకు మద్దతు 20వ తేదీ నుండి సీపీఎం ప్రత్యక్ష ఆందోళన :** అంగన్‌వాడీల సమ్మెకు మద్దతుగా ఈనెల 20వ తేదీ నుండి కలిసొచ్చే పార్టీలతో కలిసి సీపీఎం పార్టీ ప్రత్యక్ష ఆందోళన చేపడుతుందని సీపీఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ తెలిపారు. గురువారం పట్టణంలోని అంగన్‌వాడీల సమ్మె శిబిరాన్ని సందర్శించి మాట్లాడారు. అంగన్‌వాడీలు లక్షమంది వరకు 38 రోజులుగా న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సమ్మె చేస్తుంటే సమస్యల పరిష్కారానికి చొరవ చూపాల్సిన ప్రభుత్వం అణచివేయడానికి పూనుకోవడం దారుణమన్నారు. విజయవాడలో అంగన్‌వాడీలు ఆమరణ దీక్ష చేపట్టారని వారికి ఏదైనా జరుగరానిది జరిగితే ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి ఈనెల 23న ఉరవకొండకు వస్తున్నట్టు చెబుతున్నారని ఆయన మనసు మారేలా అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించేలా జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు ఒత్తిడి తీసుకొచ్చి ఇక్కడి నుండే ప్రకటించేలా చూడాలని వి.రాంభూపాల్ కోరారు.

## ఎన్టీఆర్ యుగ పురుషుడు.. ఏపి అభివృద్ధికి ఎంతగానో కృషి

**- జిల్లా కార్యనిర్వహక కార్యదర్శి జిల్లా టిడిపి లీగల్ అడ్వైజర్ న్యాయవాది రాధాకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ మూర్తి**

**మడకశిర టౌన్, జనవరి 18 ప్రభాతవార్త**



ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాలులు అర్పించిన తేదేపా నాయకులు

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ 28వ వర్ధంతిని పురస్కరించుకుని మడకశిర పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం కార్యకర్తలకు ప్రజలకు అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం జిల్లా కార్యనిర్వహక కార్యదర్శి రాధాకృష్ణ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌మూర్తిలు మాట్లాడుతూ.. ఎన్టీఆర్ యుగ పురుషుడని కీర్తించారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ఎన్టీఆర్ ఎంతగానో కృషి చేసినట్లు చెప్పారు. సినిమా రాజకీయాల్లో తనదైన ముద్ర వేశారని కొనియాడారు. తెలుగుదేశం పార్టీ పట్టణంలో నాయకులు కార్యకర్తలు కలిసి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. పలువురు నేతలు, కార్యకర్తలు విగ్రహంపై పూలు చల్లి నివాళులు అర్పించారు. స్వయంగా రక్త దానం చేశారు. తెలుగు వారి ఖ్యాతిని ఖండాంతరాలుగా వ్యాపింప చేసిన నేత ఎన్టీఆర్ అన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్తున్న మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో గుండుమల సర్పంచు మాజీ చంద్రప్ప డాక్టర్ కృష్ణమూర్తి కల్లుమరి సర్పంచు నాగరాజు, పట్టణ మండల కన్వీనర్లు మనోహర్ లక్ష్మినారాయణ, తెలుగు యువత నాయకుడు తిమ్మరాజు, నాయకులు పుల్లయ్యచౌదరి, సుబ్బారెడ్డి, రాజు రవీంద్రరెడ్డి, మార్కెట్‌బాబు కౌన్సిలర్ ఉమాశంకర్ సుబ్బరాయుడు, కోట్ల రంగేగౌడ్, వెంకటాద్రి, రంగనాథ్, రామకృష్ణ నాయక్, మంజునాథ్, మీడియా కోఆర్డినేటర్ బేగార్లపల్లిరవి, సోషల్‌మీడియా కోర్డినేటర్ చంద్ర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మల్బరి రైతుల ప్రోత్సాహకాల బకాయిలను పూర్తిగా చెల్లించాలి

**అగళి, జనవరి 18 ప్రభాతవార్త**

మండలంలో మల్బరీ సాగు రైతులు అధికంగా ఉన్నారు. మల్బరీ పట్టు గుడ్లను ఉత్పత్తి చేసే రైతులకు ప్రభుత్వం కెజి మల్బరీ గూడుకు 50 రూపాయల ప్రోత్సాహకాన్ని అందిస్తోంది. ఇలా మల్బరీ రైతులకు నాలుగేళ్లుగా సదరు బకాయిలు రాకపోవడంతో వారు నిరసన చేపట్టడానికి ప్రయత్నిస్తుండగా ప్రభుత్వం అందులో కొద్ది వరకు విదిల్చిందని, మల్బరీ రైతుల ప్రోత్సాహకాలను మొత ం విడుదల చేయాలని మండలంలోన తెలుగుదేశంపార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ ఏడాది వర్షాలు లేక రైతన్నలు ఇబ్బందులు పడుతున్నారని, ఇలాంటి సమయంలో ప్రోత్సాహకాలను విడుదలచేయాలన్నారు. మొత్తం నాలుగేళ్లలో హిందూపురం పరిధిలోని మల్బరీమార్కెట్ దాదాపు 10కోట్ల రూపాయలకుపైన బకాయిలు చెల్లించాల్సి ఉందని అందులో కొద్దోగొప్పొ విదిల్చి చేతులు దులుపుకుంటే కరువు రైతుల పరిస్థితి ఏంటని, అందుకే ప్రభుత్వం స్పందించి బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కన్వీనర్‌కుమారస్వామి, మాజీ సింగిల్ విండో అధ్యక్షులు శ్రీనివాస్, మండల మాజీ ప్రధాన కార్యదర్శి రాజన్న, కరియన్న, బసవరాజు, శిగనాగమప్ప, బూతరాజు, మల్లిక, తిప్పేస్వామి, ఫైనాన్స్ నారాయణప్ప, నరసింహమూర్తి, తిప్పేస్వామి పాల్గొన్నారు.

## ఇది వేసవి కాదే.. సెలవులు పొడిగించడానికి

**- తెలుగుదేశం పార్టీ నాయకుల ఆరోపణ**

**అగళి, జనవరి 18 ప్రభాతవార్త**

పాఠశాల, కళాశాలల విద్యార్థులకు వేసవి కాలంలో అయితే ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొంటారన్న ఉద్దేశ్యంతో విద్యార్థులకు సెలవులు పొడిగించవచ్చు. కానీ చలికాలంలో సంక్రాంతి సెలవులు 19వ తేదికి పూర్తి అవుతున్న తరుణంలో ప్రభుత్వం మరోసారి సెలవులు పొడిగించడం ఏంటని తెలుగుదేశంపార్టీ నాయకులు కన్వీనర్‌కుమారస్వామి, మాజీ సింగిల్ విండో అధ్యక్షులు శ్రీనివాస్, మండల మాజీప్రధాన కార్యదర్శి రాజన్న, కరియన్న, బసవరాజు, శిగనాగమప్ప, బూతరాజు, మల్లిక, తిప్పేస్వామి, ఫైనాన్స్ నారాయణప్ప, నరసింహమూర్తి, తిప్పేస్వామి తదితరులు ప్రశ్నించారు. అంబేద్కర్ విగ్రహం ప్రస్తుత ప్రభుత్వం ప్రారంభిస్తున్న వేళ బస్సులను, ఇతర వాహనాలతో అక్కడికిజనంను తరలించాలన్న ఉద్దేశ్యంతో ఏకంగాసెలవులు ప్రకటించిందని తెలుగుదేశంపార్టీ నాయకులు ఎద్దేవా చేశారు. విద్యార్థులకు పరీక్షలు దగ్గర పడుతున్నాయి. ఇలాంటిసమయంలో సంక్రాంతిసెలవులు కాక మరో మూడు రోజులు పాఠశాలలకు సెలవు ప్రకటించడం ఏంటని వారు ప్రశ్నించారు.

## ఘనంగా ఎన్టీఆర్‌వర్ధంతి వేడుకలు

**- వేడుకల్లో పాల్గొన్న తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు**

**అగళి, జనవరి 18 ప్రభాతవార్త**



వేడుకల్లో పాల్గొన్న టిడిపి నాయకులు, కార్యకర్తలు

దివంగత మాజీ ముఖ్యమంత్రి తెలుగుదేశంపార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ తారకరామారావు 28వ వర్ధంతి వేడుకలను తెలుగు తమ్ముళ్లు ఘనంగా జరుపుకున్నారు. ముందుగా బస్టాండ్ ప్రాంతంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కన్వీనర్ కుమారస్వామి, మాజీ టిడిపి ప్రధాన కార్యదర్శి రాజన్న, మాజీ ఎంపిపిలు రామకృష్ణప్ప, నరసింహయ్య, ఏటిఎం కరియన్న, సిగనాగప్ప, గ్యాస్ కరియన్న, బసవరాజు, మాజీ సర్పంచు శివలింగప్ప, మాజీ సర్పంచు రవికుమార్, రమేష్, మల్లేష్, నాగరాజు, జైరామ్, కరియన్న, శివకుమార్, మాజీసింగిల్‌విండో అధ్యక్షులు శ్రీనివాస్,తిప్పేస్వామి,ఫైనాన్స్ నారాయణప్ప, జడ్పిటిసి ఉమేష్ మాట్లాడుతూ.. ఎన్టీఆర్‌కారణ జన్ముడని పార్టీని ఏర్పాటు చేసి 9 నెలల్లోనే అధికారంలోకి తెచ్చిన ఘనుడని, పేదలకు 2 రూపాయలకే కిలోబియ్యం, 50రూపాయలకు హార్స్‌పవర్‌విద్యుత్, పేదలకు ఇల్లు, మండల వ్యవస్థ పట్వారీ వ్యవస్థ రద్దు లాంటి సంక్షేమ పథకాలను తీసుకొచ్చారని ముఖ్యంగా కూడు, గుడ్డ, నీడ అనే నినాదంతో తెలుగుదేశం పార్టీఆవిర్భవించిందని అన్నారు. కాంగ్రెస్‌వారి గుండెల్లో రైళ్లు పరిగెత్తించారని ఎన్టీఆర్ స్థాపించిన తెలుగుదేశంపార్టీని మాజీముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికష్టాలు వచ్చినా నిలబెట్టుకున్నారని వక్తలు అన్నారు.

## గుత్తిలో ఎన్‌టిఆర్ వర్ధంతి వేడుకలు

**గుత్తి, జనవరి 18 ప్రభాతవార్త**



ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు 28వ వర్ధంతి వేడుకలను గురువారం టిడిపి ఆధ్వర్యంలో వేర్వేరు వర్గాలు ఘనంగా నిర్వహించుకున్నాయి. ఈ సందర్భంగా ఎన్‌టిఆర్ సర్కిల్‌లో ఆయన విగ్రహానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. పేద, బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి అయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఇన్‌చార్జ్ హరినాథ్‌గౌడ్, పార్టీ కన్వీనర్లు రవిగౌడ్, బద్రివలి, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు అబ్దుల్‌జిలాన్, కోనేటి గోవిందు, దిల్‌కా శీనా, జిల్లా నాయకులు భాస్కర్‌స్వామి, శ్రీకాంత్‌చౌదరి, సురేంద్రనాయుడు, మాజీ ఎంపిపి వీరేష్, కిట్టా, తదితరులు పాల్గొన్నారు. మరోవైపు రాష్ట్ర కార్యదర్శి వెంకటశివుడు ఆధ్వర్యంలో వర్ధంతి వేడుకలు నిర్వహించి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సెల్ రాష్ట్ర కార్యదర్శి జావేద్, మాజీ కన్వీనర్ నరేంద్రచౌదరి, తెలుగుయువత కన్వీనర్ సుధాకర్‌నాయుడు, బోర్‌వెల్ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కారు డ్రైవర్‌పై స్టేషన్లలో ఫిర్యాదు..?

**మడకశిర టౌన్, జనవరి 18 ప్రభాతవార్త**



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైసీపీ నాయకులు

మడకశిర ఎమ్మెల్యే తిప్పేస్వామి కారు డ్రైవర్ ధనుపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రవి శేఖర్‌రెడ్డి, రంగయ్య గౌడ్, అమరాపురం సర్పంచు వాగేష్‌లు తెలియజేశారు. గురువారం సాయంత్రం మడకశిరలో వారు విలేకరులతో మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కారు డ్రైవర్ ధను కొడవలితో దాడి చేసి హత్యాయత్నం చేసే విధంగా సోషల్ మీడియా, అతని ఫేస్‌బుక్‌లో పోస్టు చేయడంపై పోలీసులకు ఫిర్యాదు చేశామని ఇలాంటి పిరికి చర్యలకు తాము భయపడే ప్రసక్తేలేదు ఎందుకంటే పార్టీకోసం ప్రాణాలు అర్పించడానికి సిద్ధపడ్డ వ్యక్తిని నేను, పదవి కోసం అడ్డదారులు తొక్కే చర్యలకు నేను కూడా కన్నెర్ర చేస్తే పార్టీ పరువు బజారుకు ఈడ్చిన వాడు అవుతాను అందుకోసమే ఇతని చర్యల వల్ల మేము మౌనంగా ఉన్నామె తప్ప మా మౌనాన్ని చేతకానితనంగా భావిస్తేమాత్రం తీవ్రస్థాయిలో ప్రతిఘటించాల్సిన పరిస్థితి ఉంటుంది అని వారు పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఇంతటితో ఆపకుండా ముఖ్యమంత్రి దృష్టికి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దృష్టికి కూడా తీసుకెళ్లి ఇలాంటి చర్యలను ఎండ కట్టడానికి ప్రయత్నిస్తారు. నీవు పబ్బం గడుపుకోవడానికి పార్టీని అడ్డం పెట్టుకుని కుంచిత చర్యలకు పాల్పడుతున్నావు. మీ అవినీతి చర్యలపై నోరు మెదిపితే పార్టీకి నష్టం కలుగుతుందని నేతలు మౌనం దాల్చారే తప్ప, మీ చేష్టలు మాత్రం ఫ్యాక్షన్ రాజకీయాల వైపు దారి తీసే విధంగా ఉన్నాయి. ఇలాంటి పిరికి చర్యలు మానుకోకపోతే మేము కూడా కన్నెర్ర చేయాల్సి వస్తుంది జాగ్రత్త. ఎమ్మెల్యే ప్రోత్బలంతో ఎవరు ఇలాంటి చర్యలకు పాల్పడినా నష్టపోతారని హెచ్చరిస్తున్నాను ఎందుకంటే ఇతను వాడుకొని వదిలేసే రకం. ఇలాంటి వారి కోసం మీరు బలి కావద్దండి అని పార్టీ కార్యకర్తలకు తెలియజేశారు.

## కొజ్జేపల్లి గ్రామ పేరును శ్రీపురంగా మార్పు

**-ఎమ్మెల్యే వైవిఆర్‌ను సత్కరించిన గ్రామస్తులు**

**గుత్తి, జనవరి 18 ప్రభాతవార్త**



ఎమ్మెల్యే వైవిఆర్‌ను సత్కరిస్తున్న దృశ్యం

మండలంలోని కొజ్జేపల్లి గ్రామం పేరును శ్రీపురంగా మార్పు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం విజిట్ ఉత్తర్వులు జారీ చేసింది, గ్రామ పేరు ఉత్సరించుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతూ నామోషిగా ఫీలవుతూ పేరు మార్పుపై గ్రామస్తులు సంవత్సరాల తరబడి పోరాడారు. ఎట్టకేలకు గ్రామ పేరును మార్పు చేయడంతో గ్రామస్తులు హర్షం వక్తం చేస్తూ సంబరాలు చేసుకున్నారు. పేరు మార్పుకు కృషి చేసిన ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి, గుంతకల్లు వైస్‌ఛైర్‌పర్సన్ నైరుతిరెడ్డి, గుత్తి వైకాపా ఇన్‌చార్జ శ్రీనివాసరెడ్డి, కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు మంజునాథ్‌రెడ్డిలను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మార్కెట్‌యార్డుఛైర్మన్ సునీలాయాదవ్ ఆధ్వర్యంలో గ్రామస్తులు వారిని ఘనంగా సత్కరించారు. కేక్ కట్ చేసి ఆనందాన్ని ఎమ్మెల్యేతో పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో పెద్దసంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీలపై ఎస్మా ప్రయోగం జగన్‌రెడ్డి అరాచక పాలనకు నిదర్శనం

**- జిల్లాఎస్సీ సెల్ అధ్యక్షులు మంజునాథ్**

**గుడిబండ, జనవరి 18 ప్రభాతవార్త**



అంగన్‌వాడీ కార్యకర్తలకు మద్దతు తెలుపుతున్న తేదేపా నాయకులు

అంగన్‌వాడీ కార్యకర్తలపై ఎస్మా ప్రయోగించడం జగన్‌మోహన్‌రెడ్డి అరాచక పాలనకు నిదర్శనమని తెలుగుదేశం పార్టీ జిల్లాఎస్సీ సెల్ అధ్యక్షులు మంజునాథ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన గుడిబండ ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు చేస్తున్న నిరవధిక సమ్మెకు మద్దతు తెలిపారు. నెల రోజులు దాటిన తర్వాత ఇప్పుడు సమ్మె అత్యవసర సేవలని గుర్తించారా అంటూ వైకాపా ప్రభుత్వంపై మండి పడ్డారు. సమ్మె నోటీసు ఇచ్చినప్పుడు ఎందుకు పట్టించుకోలేదని, అత్యవసర సేవలు అందించే వారికి కనీస వేతనాలు అమలు చేయాలని ప్రభుత్వానికి తెలీదా అటూ ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ మద్దనకుంటప్ప, అంగన్‌వాడీ నాయకులు మహాదేవమ్మ, లక్ష్మిదేవి, నాగమణి, భీమాబాయి, సుజాత, దేవీరమ్మ, నాగవేణి, తేదేపా మాజీ ఆసుపత్రి కమిటీ చైర్మన్ శివకుమార్, ప్రధాన కార్యదర్శి ప్రకాష్, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు లక్ష్మినరప్ప, భీమరాజు, బూదిపల్లి జయరామప్ప, మాజీ ఎంపిటిసిలు కిష్టప్ప, వెంకటేష్, నజీర్, రాజేంద్ర, భోజరాజు, నాయీబ్రాహ్మణ జిల్లా అధ్యక్షులు రామాంజినేయులు,సీనియర్‌నాయకులు రామాంజి, వెంకటేష్ తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఆర్య వైశ్య సంఘాల బలోపేతానికి కృషి చేస్తా

**- అధ్యక్షులు జెపికె రాము**

**ధర్మవరం, జనవరి 18 ప్రభాతవార్త**



మాట్లాడుతున్న ఆర్యవైశ్య సంఘం నేతలు

సత్యసాయి జిల్లాలో ఆర్యవైశ్య సంఘాల అభివృద్ధికి కృషి చేస్తానని సత్యసాయిజిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు జెపికె రాము తెలిపారు. గురువారం స్థానిక ఆర్యవైశ్య పాత సత్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సత్యసాయి జిల్లా గౌరవాధ్యక్షులు కలవల రాంకుమార్, జిల్లా అధ్యక్షులు జెపికె రాము, కార్యదర్శి రవీంద్రుడు, కోశాధికారి శ్రీకాంత్, ఉపాధ్యక్షులు దొంతి మహేష్ తదితరులు ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు జెపికె రాము మాట్లాడుతూ.. త్వరలో సత్యసాయి జిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లాలోని పేద ఆర్య వైశ్యుల ఆర్థిక పురోగాభివృద్ధికి ప్రత్యేక కార్యక్రమాలతోపాటు, విద్య, వైద్య తదితర కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. ప్రత్యేకించి జిల్లా కమిటీలను బలోపేతం చేసేందుకు కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. జిల్లా ఉపాధ్యక్షులుగా మురళీధర్‌ను, జాయింట్ కార్యదర్శిలుగా ఓ.వి.ప్రసాద్, కాకుమాని హరి, ఈసీ మెంబర్లుగా మెకాగోపి, కాకుమాని విద్యా సాగర్, చిలుముకూరి రాము, గ్రంధే శ్రీనివాసులు, జిల్లా ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షులుగా కలవల నాగ తేజ, జిల్లా వాసవి మాల ధారణ కమిటీ అధ్యక్షులుగా గోపాల్, చంద్రకాంత్ తదితరులను ఎంపిక చేశారు.

